https://vijayamdaily.com

# విజయం


పేజీలు :
6

అక్షర సమరానికి నాంది..

ఖమ్మం
భద్రాద్రి
కొత్తగూడెం

ఆదివారం/జనవరి/22/2023

https://vijayamdaily.com



## బీఆర్ఎస్‌కు కోరం కనకయ్య

# గుడ్‌బై..?



- -పొంగులేటి గూటిలో జడ్పీ చైర్మన్
- -బహిరంగ సభకు గైర్హాజరు
- -ఆయన బాటలోనే మరికొంత మంది ప్రజాప్రతినిధులు
- -రేపు ఇల్లెందులో పొంగులేటి ఆత్మీయ సమ్మేళనం
- -హాజరవుతున్న కోరం, ప్రజాప్రతినిధులు..?
- -10వేల మందితో సమ్మేళనంకు ఏర్పాట్లు పూర్తి

2లో..



ఇల్లెందు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, ప్రస్తుత జడ్పీచైర్మన్ కోరం కనకయ్య పార్టీని వీడుతున్నారా..? బీఆర్ఎస్ పార్టీకి గుడ్ బై చెప్పనున్నారా..? ఆయనతో పాటు ఆయన వర్గీయులు, ప్రజాప్రతినిధులు బీఆర్ఎస్ పార్టీని వీడనున్నారా..? వారంతా పొంగులేటి బాటలో పయనించేందుకు సిద్ధమైయ్యారా..? అంటే నిజమేనని అంటున్నారు ఇల్లెందు నియోజకవర్గ ప్రజలు.. ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న కోరం కనకయ్య.. దాదాపుగా ఆ పార్టీని వీడినట్లేనని ఆయన వర్గీయులు చెబుతున్నారు. అంతే కాకుండా ఆయన వర్గీయులు, ప్రజాప్రతినిధులు కూడా ఆయన బాటలో పయనించే అవకాశం ఉంది.. అందులో భాగంగానే ఈనెల 23న ఇల్లందులో పొంగులేటి ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. భారీ జన సమీకరణ నడుమ ఈ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు కసరత్తు పూర్తి చేశారు. కోరం కనకయ్య పార్టీ మారుతున్నారా..? ఆయన రాబోయే రోజుల్లో ఏ పార్టీలోకి వెళ్తున్నారనే విషయంపై 'విజయం ప్రతినిధి' అందించే రాజకీయ విశ్లేషణాత్మక కథనం (తమ్మిశెట్టి, ఇల్లెందు- విజయం న్యూస్)

## నేడు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పరీక్ష

- -హాజరుకానున్న 6664 మంది అభ్యర్థులు
- -19 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు
- -ఈ పరీక్ష కు అభ్యర్థులు సకాలంలో రావాలని కలెక్టర్ పిలుపు
- -భారీగా ఏర్పాట్లు చేసినట్లు ప్రకటన



ఖమ్మం, జనవరి 21(విజయంన్యూస్): తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నేడు (ఆదివారం) నిర్వహించనున్న అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఖాళీ పోస్టుల భర్తీ కోసం ప్రభుత్వం ఇటీవలే నోటిఫికేషన్ విడుదల చేయగా, ఆ పరీక్షను ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నారు.. ఈ పరీక్షకు ఖమ్మం జిల్లా వ్యాప్తంగా మొత్తం 6664 మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, అందుకు గాను 19 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ వి.పి.గౌతమ్ తెలిపారు. చాలా రోజుల తరువాత

మిగతా 2లో..

## ఖమ్మం జిల్లాను అవినీతి రహిత జిల్లాగా

# తీర్చిదిద్దాలి

2లో

అన్నిశాఖలాధికారులకు సూచించిన ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ శ్రీనివాస్‌రావు



# బీఆర్ఎస్‌కు కోరం గుడ్ బై..?

**(తమ్మిశెట్టి, ఇల్లెందు-విజయం న్యూస్)**

ఇల్లెందు నియోజకవర్గం ఉద్యమాలకు పెట్టింది పేరు.. అనేక ఉద్యమాలకు వేదికగా మారింది.. తెలంగాణ ఉద్యమం ఇక్కడినుంచి పురుడు పోసుకుంది.. తొలిదశ, మలిదశ ఉద్యమానికి నాంధి అయ్యింది ఇల్లెందు నియోజకవర్గం. సింగరేణి, కార్మిక ఉద్యమాలకు పేరుగాంచింది. 1957లో నియోజకవర్గంగా ఏర్పడి ఎస్టీ రిజర్వేషన్ గా మారింది. ఆ తరువాత 1962లో జనరల్ గామారింది. ఆ తరువాత 1978లో ఎస్టీ రిజర్వేషన్ గా మారి, నేటి వరకు అలాగే కొనసాగుతుంది. అయితే మొత్తం 14 సార్లు ఎన్నికలు జరగ్గా అందులో 5 సార్లు కాంగ్రెస్, ఒక సారి టీడీపీ, 6 సార్లు న్యూడెమోక్రసీ, 2 సార్లు సీపీఐ పార్టీ గెలిచింది. అలాంటి ఇల్లెందు నేడు రాజకీయ పెనుమార్పులకు కేరాఫ్ అడ్రస్ గా మారింది. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా ఇల్లెందు నియోజకవర్గంలో రాజకీయం రోజుకో మలుపు తిరుగుతుంది. ముఖ్యంగా ఇల్లెందు నియోజకవర్గం కమ్యూనిస్టులకు అడ్డాగా ఉంది. అనేక దఫాలుగా కమ్యూనిస్టులు పాలించిన నియోజకవర్గం ఇది. అలాంటి నియోజకవర్గంలో 25 సంవత్సరాల తరువాత కాంగ్రెస్ జెండాను ఇల్లెందు నియోజకవర్గంపై ఎగరవేసిన నాయకుడు కోరం కనకయ్య. ఆ తరువాత ఆయన అధికార పార్టీకి పోవడం తిరిగి హరిప్రియనాయక్ కాంగ్రెస్ నుంచి గెలవడం జరిగింది. ప్రస్తుతం కోరం కనకయ్య ఎమ్మెల్యేగా ఓటమి చెందినప్పటికి, తిరిగి జడ్పీచైర్మన్ గా ఎన్నికైయ్యారు.

20 ఏళ్ల తరువాత ఇల్లెందుపై ఎగిరిన కాంగ్రెస్ జెండా

మాజీ ఎమ్మెల్యే, జడ్పీచైర్మన్ కోరం కనకయ్య గులాబీ పార్టీకి గుడ్ బై చెప్పే పరిస్థితి కనిపిస్తోంది. 2009 లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి స్వల్ప తేడాతో ఓటమి చెందిన కోరం కనకయ్య ఆ తరువాత 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఎమ్మెల్యేగా విజయం సాధించారు. అనంతరం ఆనాటి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హాయంలో టీఆర్ఎస్ గూటికి వెళ్లిపోయిన కోరం కనకయ్య 2018 ఎన్నికల్లో ఓటమి చెందారు. అప్పటి నుంచి తుమ్మల నాగేశ్వరరావుతో ఉండగా, ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీలో జడ్పీచైర్మన్ గా ఉన్నప్పటికి, కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన హరిప్రియ నాయక్ బీఆర్ఎస్ పార్టీలో చేరడంతో ఆయనకు టిక్కెట్ వచ్చే అవకాశాలు లేవు. దీంతో ఇటీవలే గత రెండేళ్ల నుంచి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వర్గీయుడిగా, ముఖ్య అనుచరుడిగా మారిపోయారు. అయితే జనబలం ఉన్న కోరం కనకయ్య ఆర్థిక పరిస్థితి మాత్రం అంతంతంగానే ఉంది. ఈ క్రమంలో పొంగులేటి కరెక్ట్ అని భావించిన కోరం కనకయ్య ఆయనతోనే ఉండిపోతున్నారు.

బీఆర్ఎస్ కు కోరం దూరం.

సీఎం కేసీఆర్ చేపట్టిన అత్యంత కీలక బహిరంగ సభకు అధికార పార్టీలో పదవులను అనుభవిస్తున్న వారు కూడా ఈ సభకు దూరంగా ఉన్నారు. ప్రధానంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జడ్పీ చైర్మన్ కోరం కనకయ్య బహిరంగ సభకు పూర్తిగా దూరంగా ఉన్నారు. ఆయన బహిరంగ సభ సమయంలో హైదరాబాద్ లో ఉన్నప్పటికి ఆయన వర్గీయులు కూడా బహిరంగ సభకు వెళ్లలేదు. కనీసం పంపించే ప్రయత్నం కూడా జరగలేదు. మొదటి నుంచే కోరం కనకయ్య పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి ముఖ్య అనుచరుడిగా ఉండగా, పొంగులేటితో బయటకు వెళ్లేందుకు సిద్దమైనట్లు తెలుస్తోంది. అయితే కోరం కనకయ్యను నిలువరించేందుకు, బుజ్జగించేందుకు ఖమ్మం జిల్లాలోని కీలక నాయకులు, ఇంచార్జ్ గా వచ్చిన డబుల్ షూటర్ హరీష్ రావు కూడా కోరం కనకయ్యకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికి ఫలితం దక్కలేదు. కోరం కనకయ్య ప్రస్తుతం రాజకీయాలకు దూరంగా ఉంటున్నారు.

శీనన్న వైపు ముగ్గు?

మాజీ ఎంపీ పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి వైపే కోరం కనకయ్య మొగ్గు చూపుతున్నారు. ఇటీవల జరుగుతున్న పరిణామాలను బట్టి చూస్తే ఇల్లెందు నియోజక వర్గం నుంచి బరిలో ఉండేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నట్లుగా స్పష్టం అవుతుంది. గత ఎన్నికల్లో స్వల్ప తేడాతో కోరం ఓటమిపాలయ్యారు. అయినప్పటికీ నియోజకవర్గ వ్యాప్తంగా ఆయన అనుచరులను వదిలిపెట్టకుండా కాపాడుకుంటూ వచ్చారు. గత మూడేళ్ల నుండి నియోజకవర్గ నలుమూలల పర్యటిస్తూ శ్రీనివాస్ రెడ్డి ద్వారా పలు కుటుంబాలకు ఆర్థిక సాయం చేస్తూ వస్తున్నారు. ఈ సామాజిక ఆర్థిక సహాయాలు కోరం కనకయ్యకు కలిసి వచ్చే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

రేపు ఆత్మీయ సమ్మేళనం

పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇటీవలే ఉమ్మడి జిల్లాలోని అన్ని నియోకవర్గాల్లో ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే కొన్ని నియోజకవర్గాల్లో సమ్మేళనాలను ఏర్పాటు చేయగా, సోమవారం ఇల్లెందు పట్టణంలో భారీ ఎత్తున ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఓ మామిడితోటలో ఇప్పటికే అందుకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేశారు. ఆ కార్యక్రమాన్ని కోరం కనకయ్య దగ్గరుండి ఏర్పాట్లు చేయిస్తున్నట్లుగా తెలుస్తోంది. సుమారు 10వేల నుంచి 15వేల మందితో ఈ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించేందుకు కోరం ఏర్పాట్లు చేసినట్లు తెలుస్తోంది. ఈ సమావేశానికి సర్పంచ్ లు, ఎంపీటీసీలు, జడ్పటీసీలు హాజరైయ్యేందుకు సిద్దమైనట్లు సమాచారం. దీంతో బీఆర్ఎస్ పార్టీని వీడుతున్నట్లుగా కోరం కనకయ్య ఆ పార్టీ నాయకులకు చెప్పకనే చెప్పినట్లుగా భావించాల్సి ఉంది. అయితే కోరం కనకయ్య ఏ పార్టీలోకి వెళ్తారనేది మాత్రం సస్పెన్సనే.. ఎందుకంటే ముందుగా బీజేపీ పార్టీలోకి వెళ్లాలని భావించిన పొంగులేటి ఆ తరువాత కొంత బ్యాక్ అయ్యారనేది తెలుస్తోంది. ఈనెల 18న అమిత్ షాతో బేటి అని ప్రచారం జరిగినప్పటికి కొంత మంది నియోజకవర్గ ఇన్ చార్జ్ లు కాంగ్రెస్ పార్టీ వైపు వెళ్లేందుకు సంసిద్దత వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో పొంగులేటి అందర్ని కలుపుకుని, ఏక నిర్ణయంతో పార్టీ మారలని భావించి ఇతర పార్టీలో చేరిక అంశాన్ని కొంత ఆలస్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తానికి బీఆర్ఎస్ పార్టీకి జడ్పీ చైర్మన్ కోరం కనకయ్య దాదాపు గుడ్ బై చెప్పినట్లేగా భావించాల్సి ఉంది. చూద్దాం రాబోయే రోజుల్లో ఏం జరగబోతుందో..?

## నేడు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పరీక్ష

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించే ఈ పరీక్షకు కట్టుదిట్టమైన, భారీ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. 19 కేంద్రాలకుసంబంధించిన వివరాలను ఇప్పటికే అభ్యర్థులకు హాల్ టిక్కెట్ల ద్వారా అందజేశారు. అభ్యర్థులు ఇంకనూ హాల్ టికెట్లు డౌన్లోడ్ చేసుకొనని వారు డౌన్లోడ్ చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. నేడు ఆదివారం (జనవరి 22)న ఉదయం, సాయంత్రం నిర్వహించు ఈ పరీక్ష కు ఉదయం సెషన్ లో 09.45 గంటలకు, మధ్యాహ్నం సెషన్ కు 02.15 గంటలకు పరీక్ష కేంద్రం గేట్లు మూసివేయబడతాయని, ఆ తర్వాత విద్యార్థులు ఎవరిని కూడా పరీక్షా కేంద్రంలోకి అనుమతించబడరని ఆయన తెలిపారు. మోడల్ ఓఎంఆర్ షీట్ లో బబ్లింగ్ ప్రాక్టీస్ చేయాలని, ఓఎంఆర్ జవాబు పత్రంలో తప్పు బబ్లింగ్ కాకుండా నివారించాలన్నారు. అస్పష్టమైన ఫోటో/ చిన్న ఫోటో/ ఫోటో లేకుండా లేదా సంతకం లేకుండా హాల్ టికెట్ ను డౌన్లోడ్ చేసుకున్న అభ్యర్థులు గెజిటెడ్ అధికారి చేత ధ్రువీకరించబడిన మూడు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలను తప్పనిసరిగా తీసుకొని రావాలని, పరీక్ష హాల్లోని ఇన్విజిటర్ కు అప్పగించిన తర్వాతే అభ్యర్థిని పరీక్ష కు అనుమతించబడునని ఆయన అన్నారు.

## సీపీఎం ఏపీ కార్యదర్శి వి.శ్రీనివాస్ రావు స్వాగతం పలికిన జిల్లానేతలు

ఖమ్మం, జనవరి 21 (శనివారం):- శనివారం స్థానిక సుందరయ్య భవన్లో సిపిఎం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావును ఖమ్మం జిల్లా సిపిఎం కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు మరియు సిపిఎం ఖమ్మం జిల్లా నేతలు పుష్ప గుచ్చం యిచ్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఖమ్మం జిల్లా వామపక్ష ఉద్యమాలకు కేంద్రంగా అనేక పోరాటాలు నడిపిన చరిత్ర ఉన్నదని, జిల్లాతో తనకు గల అనుబంధాన్ని గుర్తు చేశారు. జిల్లాలో పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాలు, పోరాటాలను అడిగి తెలుసుకున్నారు. స్వాగతం పలికిన వారిలో సిపిఎం రాష్ట్ర కమిటి సభ్యులు యర్రా శ్రీకాంత్, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై. విక్రం, జిల్లా కమిటి సభ్యులు మాదినేని రమేష్, నందిపాటి మనోహర్, ఆర్.ప్రకాష్, నాయకులు చింతల రమేష్, కె. అమరావతి, శీలం నర్సింహారావు, కె. గోపి, బివికె మేనేజర్ వై. శ్రీనివాసరావు, కళ్యాణం నాగేశ్వరరావు, గణపతి తదితరులు పాల్గొన్నారు.



# ఖమ్మం జిల్లాను అవినీతి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

**ఖమ్మం, జనవరి 21(విజయంన్యూస్):**

ఖమ్మం జిల్లాని అవినీతి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలని, ఇందుకై ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డా. టి. శ్రీనివాసరావు అన్నారు. శనివారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి, ఐడిఓసి లోని సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులకు అవినీతి, వరకట్నం, భ్రూణ హత్యల నివారణకు జిల్లా కలెక్టర్ తో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమాజంలో ప్రతి ఒక్కరూ నీతి నిజాయితీలతో ఉంటే సమాజం కూడా అదే రకమైన వాతావరణాన్ని కల్పిస్తుందని అన్నారు. అందరూ నీతి నిజాయితీలతో పనిచేస్తే సమాజం అటువంటి పరిస్థితులే అందరికీ కల్పిస్తుందని దీంతో సమాజమంతా సుఖసంతోషాలతో నిండిపోతుందని అన్నారు. ఏ విత్తనం వేస్తే అదే చెట్టు మొలకెత్తుతుందనే సామెతను ఉటంకిస్తూ న్యాయమూర్తి అవినీతి రహిత సమాజాన్ని నిర్మించాలంటే ముందు వ్యక్తి అవినీతికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. అలెగ్జాండర్ చివరి మాటలను ఉటంకిస్తూ, వెళ్లెప్పుడు ఏమి పట్టుకుపోలేమని, డాక్టర్లు మనలను కాపాడలేరని, సంపాదించినదంతా మన వెంట రాదని అన్నారు. మనం మంచిగా ఉంటే మంచితనానికి ప్రతిగా మంచితనమే లభిస్తుందని అన్నారు. న్యాయమూర్తుల ఒకానొక సమావేశంలో ఒక కేరళ న్యాయమూర్తి తమ రాష్ట్రంలో అవినీతి ఉండదని సగర్వంగా ప్రకటించారని, అటువంటి ఉత్తమ లక్ష్యం దిశగా మనందరం పయనించాలని ఆయన ఉద్భోదించారు. వరకట్న దురాచారాన్ని రూపుమాపాలని మగ పిల్లలు ఉన్న తల్లిదండ్రులు అందరూ తమ పిల్లవానికి కట్నం తీసుకోమని ప్రతి న పూనాలన్నారు. భ్రూణ హత్య మహా పాపమని, అది నేరమని అన్నారు.



ఆడపిల్ల ని కాపాడుకోవాలన్నారు. భ్రూణ హత్య చేస్తే శిక్షించబడతారని ఆయన తెలిపారు. జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ మాట్లాడుతూ, దేశంలో టాప్ 5 వ్యక్తుల్లో మనమున్నామని, 95 శాతం వాళ్ళ డబ్బుతో మనం ఈ స్థితిలో ఉన్నట్లు తెలిపారు. ఆశ మానవ స్వభావమని అదే అవినీతికి మనిషిని ప్రేరేపిస్తుందన్నారు. మనిషి యొక్క వ్యక్తిత్వం వెలకట్టలేనిదని కాబట్టి అవినీతికి పాల్పడి, దానికి విలువ నిర్ణయించవద్దని ఆయన కోరారు. విలాసవంతమైన జీవితంలో సౌకర్యం ఉండవచ్చేమో కానీ నీతివంతమైన జీవితంలో సంతృప్తి నిశ్చయంగా ఉంటుందన్నారు. మనిషికి గౌరవప్రదమైన జీవితం చాలా ముఖ్యమని ఆయన తెలిపారు. బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న మనం తప్పు చేస్తే సమాజం సహించదని ఆయన అన్నారు. ధైర్యంగా ఉండాలంటే తప్పు చేయకుండా ఉండాలని ఆయన సూచించారు. నేను అమ్మకానికి లేను.. నా విలువ అమూల్యమని అనుకుంటే అవినీతికి పాల్పడమని ఆయన అన్నారు.



ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ స్నేహలత మొగిలి, ఖమ్మం మునిసిపల్ కమీషనర్ ఆదర్శ్ సురభి, న్యాయమూర్తులు ఎన్. సంతోష్ కుమార్, ఎం. ఏ. జావిద్ పాషా, ఆశారాణి, ఆశాలత, మౌనిక, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అంతకుముందు కలెక్టర్, ఐడిఓసికి వచ్చిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి కి పుష్పగుచ్ఛం తో స్వాగతం పలికి, ఐడిఒసి ప్రత్యేకతలు వివరించారు. మూడు ఫ్లోర్లలో ఉన్న అధికారులు, సిబ్బంది కార్యాలయాలను చూపించారు. ఐడిఒసి లో 40 శాఖల కార్యాలయాలు నిర్వహణలో ఉన్నట్లు, 1000 మంది సిబ్బంది పనిచేస్తున్నట్లు కలెక్టర్ ప్రధాన న్యాయమూర్తికి వివరించారు.

# సభ సక్సెస్ కు నామా కృషి



**-దేశం అబ్బుర పడేలా అవిష్కృతమైందన్న నామా**

**-సక్సెస్ చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపిన ఎంపీ**

ఖమ్మం, జనవరి 21(విజయంన్యూస్):

సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి, సభ ఇన్చార్జి తన్నీరు హరీష్ రావు నేతృత్వంలో దేశం అబ్బుర పడేలా టీఆర్ఎస్ ఆవిర్భావ సభ మహాద్భుతంగా సక్సెస్ అవ్వడం జరిగిందని లోక్ సభా పక్ష వేత ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు అన్నారు. అందరి సమష్టి, సహకారంతో విశేష కృషి చేశారని, తనవంతు పాత్ర అద్భుతమని, అందుకు ధన్యవాదాలు చెబుతున్నట్లు తెలిపారు. జనవరి 9వ తేదీ నుంచి 18వ తేదీ వరకు కూడా ఎంపీ నామ ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా 10 నియోజకవర్గాల్లో స్థానిక నాయకత్వంతో కలిసి విస్తృతంగా పర్యటించి, జన సమీకరణకు నాయకత్వాన్ని అన్ని విధాలా ప్రేరేపించారు. కదలించారు. నామ పక్కా ప్రణాళికతో ఖమ్మం, పాలేరు, వైరా, మధిర, సత్తుపల్లి, కొత్తగూడెం, ఇల్లెందు నియోజకవర్గాల్లో దావాణంలా పర్యటించి, జన సమీకరణకు స్థానిక నాయకత్వాన్ని సమాయత్తం చేశారు. పక్కా వ్యూహంతో పని చేసి, సభ అన్ని విధాలా సూపర్ సక్సెస్ కావడంలో నామ నఫలీకృతులయ్యారు. తన్నీరు హరీష్ రావుతో పాటు మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, రాజ్యసభ ఎంపీలు బండి పార్ధసారధిరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్, ఎమ్మెల్యేలు కందాళ ఉపేందర్ రెడ్డి, లావుడ్యా రాములు నాయక్, సండ్ర వెంకటవీరయ్య, వనమా వెంకటేశ్వరరావు, మెచ్చా నాగేశ్వరరావు, ఖమ్మం జిల్లా పరిషత్ ఛైర్మన్ లింగాల కమలరాజు నహకారంతో ముందుకెళ్లి, ఆయా నియోజక వర్గాల్లో సుడిగాలి పర్యటనలు జరిపి, పెద్ద ఎత్తున సభ సన్నాహక సమావేశాలు ఇబ్బడిముబ్బడిగా నిర్వహించి, జన సమీకరణకు నాయకత్వాన్ని సన్నద్ధం చేశారు. వెళ్లిన ప్రతి చోట స్థానిక ఎమ్మెల్యే నిర్దేశకత్వంలో స్థానిక నాయకత్వం సహకారం, చొరవతో పెద్ద ఎత్తున జననమీకరణకు నామ కృషి చేశారు. అంతేకాకుండా స్థానిక నాయకులందర్నీ ఏకతాటిపైకి తీసుకొచ్చి, వారిని సమన్వయపర్చి, సమైఖ్య పర్చి సభకు నమాయ త్తపర్చారు. ఖమ్మంలో తొలి బీఆర్ఎస్ నభ నిర్వహణకు సీఎం కేసీఆర్ మూహుర్తం ఖరారు చేయగానే ఎంపీ నామ ఖమ్మంలో పూర్తిస్థాయిలో మకాం పెట్టి, సంక్రాంతి పండుగ రోజుల్లో కూడా మండలాలకు వెళ్లి, జనం మధ్యలోనే గడిపారు. వారి మధ్యే ఉంటూ జన సమీకరణకు విశేషంగా శ్రమించారు. దాదాపు వారం రోజులు పాటు కీలక బాధ్యతలు తీసుకుని, ప్రజలతో ఉండి, సభ విజయవంతంపై ప్రధానంగా దృష్టి పెట్టారు. తొలి రోజు ఎంపీ నామ పాలేరు నియోజకవర్గంలో పర్యటించి, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో స్థానిక నాయకత్వంతో సమావేశ మయ్యారు. తర్వాత ఖమ్మంలో మంత్రి క్యాంప్ కార్యాలయం, వైరా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం,



మధిరలో వానవీ కళ్యాణ మండపం, సత్తుపల్లి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం, నత్తుపల్లి మామిడి తోట, కొత్తగూడెం ఎమ్మెల్యే స్వగృహం తదితర చోట్ల ఆయా మండలాల నాయకత్వం, ప్రజా ప్రతినిధులతో ఎంపీ నామ స్వయంగా భేటీలు జరిపి, జన సమీకరణకు వారిని సమాయత్తం చేశారు. అంతేకాకుండా సత్తుపల్లి ఎమ్మెల్యేను సైతం వెంటబెట్టుకుని, గండుగులపల్లి వెళ్ళి మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి, జన సమీకరణపై పూర్తి స్థాయిలో చర్చించడమే కాకుండా సత్తుపల్లి మామిడి తోటలో జరిగిన సన్నాహక సమావేశానికి తుమ్మలతో సహా హాజరై, స్థానిక నాయకత్వంతో చర్చించారు. ఎంపీ నామ సమిష్టి సహకారంతో గండుగులపల్లిలో తుమ్మల ఇంటికి వెళ్లి ఆయనతో భేటీ అయ్యారు.

తుమ్మల పార్టీ సన్నాహక సమావేశాలకు హాజరు కావడంతో పాటు పాలేరు నియోజకవర్గం నుంచి ఖమ్మంలో జరిగిన సన్నాహక సమావేశానికి పెద్ద ఎత్తున హాజరై, ఐక్యత చాటారు. ఎంపీ నామ తన పర్యటనల ద్వారా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఆత్మీయులు, నేతలందరిలో నూత నుత్సాహం నింపారు. రాష్ట్ర మంత్రులు హరీశ్ రావు,ప్రశాంత్ రెడ్డి, వైరా నియోజకవర్గ ఇన్చార్జులు శ్రీధర్ రెడ్డి, క్రాంతి కిరణ్ ( ఎమ్మెల్యే) తో కలిసి, ఖమ్మం, తల్లాడ, కల్లూరు, సత్తుపల్లి, మధిర తదితర ప్రాంతాల్లో పర్యటించి, స్థానిక నాయకత్వాన్ని ముందుకు నడిపించారు. ర్యాలీలు నిర్వహించి, సభ విజయవంతానికి శక్తివంచన లేకుండా శ్రమించారు. అన్ని నియోజక వర్గాల్లో నాయకులంతా సమిష్టిగా పని చేసేలా అందర్నీ ఒక తాటి మీదకు తీసుకువచ్చారని చెప్పవచ్చు. నామ మండలాలకు, గ్రామాలకు వెళ్ళినప్పుడు స్థానిక ముఖ్య నాయకులంతా ఏకతాటిపైకి వచ్చారు. అలాగే నభ విజయవంతానికి భారీ ఎత్తున జనాన్ని సభకు తరలించుకు వచ్చారు. నామ ఎంతో వ్యూహాత్మకంగా ఆయా నియోజకవర్గాల్లో పర్యటించి, సన్నాహక సమావేశాలను నిర్వహించి, అంతా సమన్వయంతో ముందుకు నడిచేలా నామ కృషి చేశారు. ఎక్కడికి వెళ్ళినా నామకు స్థానిక నాయకత్వం ఆప్యాయతతో ఘన స్వాగతం పలికి, ఆదరించారు. కేసీఆర్ వెంటే నడుస్తామని భరోసా ఇచ్చారు. 18న సభకు భారీ ఎత్తున జనం తరలిరావడంతో నామ కృషి ఫలించినట్లయింది. సభ అనంతరం రాత్రి ఇంటి వద్ద రాజ్యసభ ఎంపి బండి పార్ధసారధిరెడ్డి, ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షులు తాతా మధునూధన్ తదితర నాయకుల సమక్షంలో పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి, సంబురాల్లో నామ పాలుపంచుకున్నారు. సభ ఊహించని విధంగా చరిత్రలో నిలిచే పోయే విధంగా సక్సెస్ చేసినందుకు ఎంపీ నామ ప్రజలకు, సహరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఇంతటి కృషి చేయడం వల్లనే సీఎం కేసీఆర్ ఎంపీ నామకు ప్రత్యేకించి, ఫోన్ చేసి, అభినందించారు. ఖమ్మం నభ స్ఫూర్తితో భవిష్యత్ లో కూడా పని చేయాలని కేసీఆర్ నామతో అన్నారు..

పార్లమెంటరీ స్థాయీ సంఘ సభ్యుడి హెూదాలో నామ పర్యటన

పలు అంశాలపై ఎంపీ నామ కీలక సమీక్షలు

: ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన పార్లమెంటరీ స్థాయీ సంఘం కమిటీ సభ్యుడి హెరీదాలో లోక్ సభా పక్ష నేత, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు నామ నాగేశ్వరరావు ఈనెల 19 నుంచి 23వ తేదీ వరకు దేశంలోని ముంబాయి, అహ్మదాబాద్ తదితర ప్రాంతాల్లో అధ్యయన పర్యటనలో భాగంగా విస్తృతంగా పర్యటిస్తూ, పలు శాఖల ఆర్థిక అంశాలకు సంబంధించిన కీలక అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించి, సమీక్షిస్తున్నారు. అందులో భాగంగా శనివారం ముంబాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా బ్యాంకింగ్ రంగానికి సంబంధించిన కార్యకలాపాలు,బ్యాంకింగ్ సెక్టార్ పనితీరు తదితర అంశాలపై బ్యాంక్ ఛైర్మన్, సంబంధిత ఉన్నతాధికారులతో సమావేశమై, కూలంకషంగా సమగ్రంగా సమీక్షించి, చర్చించారు. 19న వ్యవసాయ రుణ విధానం తదితర అంశాలపై చర్చించారు. ఈనెల 23న గుజరాత్ లోని గాంధీనగర్ సందర్శించి, పలు కీలక అంశాలపై సంబంధిత అధికారులతో సమావేశమై, చర్చించి, సమీక్షిస్తారు. ఈ అధ్యయన పర్యటనలో పార్లమెంటరీ స్థాయీ సంఘ సభ్యులు, పలు శాఖల ఛైర్మన్లు, ఉన్నతాధికారులు పాల్గొంటున్నారు

## కంటివెలుగు శిబిరాలను నాణ్యతతో నిర్వహించాలి

**ఖమ్మం, జనవరి 21(విజయంన్యూస్):**

జిల్లాలో కంటి వెలుగు శిబిరాలను నాణ్యతతో, పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి రిజ్వి, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ శ్వేత, సంబంధిత ఉన్నత అధికారులతో కలిసి కంటి వెలుగు నిర్వహణ పై జిల్లా కలెక్టర్ లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శికి జనవరి 19, 20వ తేదీల్లో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన కంటి వెలుగు శిబిరాల వివరాలను వైద్య శాఖ అధికారులు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 2 రోజుల్లో 3,82,616 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని, 99,968 మందికి రీడింగ్ కళ్ళద్దాలు పంపిణీ చేశామని, 77,142 ప్రిస్క్రిప్షన్ కళ్ళద్దాలను ఆర్డర్ చేశామని అధికారులు వివరించారు. కంటి వెలుగు శిబిరాలను విజయవంతంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసిన జిల్లా కలెక్టర్ లను, సంబంధిత అధికారులను సీఎస్ అభినందించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, ప్రతి వారం సోమవారం నుంచి శుక్రవారం వరకు క్యాంపులు జరుగుతాయని, శని ఆదివారాలు క్యాంపులు ఉండవని తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 9-15 లోపు కంటి వెలుగు క్యాంపుల సమాచారం అప్ డేట్ చేయాలని సీఎస్ సూచించారు. జిల్లాలో ఉన్న క్వాలిటీ కంట్రోల్ బృందాలు విస్తృతంగా కంటి వెలుగు క్యాంపులో పర్యటించాలని, జిల్లా కలెక్టర్ లు సదరు బృందాల ఫీడ్ బ్యాక్ తీసుకుని మరింత మెరుగ్గా కంటి వెలుగు శిబిరాల నిర్వహణకు చర్యలు తీసుకోవాలని సీఎస్ ఆదేశించారు. రాష్ట్రంలో నిర్వహించిన 2 రోజులు క్యాంపులో 11 జిల్లాల పరిధిలో 53% పైగా కళ్ళద్దాల పంపిణీ/ఆర్డర్ అవసరం అయ్యాయని సీఎస్ తెలిపారు. జిల్లాలో ఉన్న బఫర్ బృందాలను ఉపయోగిస్తూ జర్నలిస్టులకు, ఉద్యోగులకు, పోలీసులకు, కోర్టు సిబ్బంది, వివిధ వర్గాల వారికి ప్రత్యేక కంటి వెలుగు క్యాంపులను నిర్వహించాలని అన్నారు. జిల్లాలో రాబోయే 15 రోజులలో బఫర్ బృందాల ద్వారా ప్రత్యేక వర్గాల కోసం క్యాంపులు ఏర్పాటు కావాలని, దీనికి అవసరమైన షెడ్యూల్ తయారు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో కంటి వెలుగు క్యాంపు నిర్వహణ సమయంలో పక్కాగా ట్యాబ్ ఎంట్రీ వివరాలు నమోదు కావాలని, ప్రతి రోజూ ట్యాబ్ ఎంట్రీ పర్యవేక్షించాలని సీఎస్ సూచించారు. జిల్లాలో ఉన్న రీడింగ్ కళ్ళద్దాల స్టాక్ ను కలెక్టర్ లు ప్రతి రోజూ పర్యవేక్షించాలని, అవసరమైన కళ్ళద్దాల స్టాక్ వివరాలు పాయింట్ల వారిగా ముందుగా సమాచారం అందిస్తే జిల్లాలకు సకాలంలో సరఫరా చేస్తామని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ పాల్గొన్న జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ మాట్లాడుతూ, జిల్లాలో 55 బృందాలు ఏర్పాటుచేసినట్లు తెలిపారు. శుక్రవారం నాటికి 13,673 మందికి జిల్లాలో కంటి పరీక్షలు నిర్వహించి 4270 మందికి రీడింగ్ కళ్ళద్దాలు అందించామని అన్నారు. సూచనల మేరకు చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ స్నేహాలత మొగిలి, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి డా. మాలతి, జెడ్పి సిఇఓ వి.వి. అప్పారావు పాల్గొన్నారు.




## అభినందనలు... ఆత్మీయ పలకరింపులు



(ఖమ్మం-విజయంన్యూస్):

కలకాలం మీ వెంటే ఉంటామని... మీ అడుగు జాడల్లోనే పయనిస్తామని... భవిష్యత్తు రాజకీయాలకనుగుణంగా మీరు తీసుకునే నిర్ణయమే మాకు శిరోధార్యమని పేర్కొంటూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న అనేకమంది నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వందల సంఖ్యలో తరలివచ్చి ఖమ్మం మాజీ పార్లమెంటు సభ్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి ని ఆయన క్యాంపు కార్యాలయంలో శనివారం కలిశారు. ఈ సందర్భంగా పొంగులేటి ప్రతి ఒక్కరిని ఆత్మీయంగా పలకరిస్తూ వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు. రాజకీయంగా ఏ నిర్ణయం తీసుకున్న తొలుత మీతోనే చర్చిస్తానని వారికి స్పష్టం చేశారు. అనంతరం వెయిట్ లిఫ్టింగ్ లో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారిణిని అభినందించారు. అదేవిధంగా ఉమ్మడి జిల్లాలోని పలు ఆలయాల, చర్చిల నిర్మాణ నిమిత్తం విరాళాలను అందజేశారు.



## సింగరేణి ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరించిన ఏరియా జిఎం



**మణుగూరు జనవరి 21( విజయం న్యూస్)**
సింగరేణి ఎస్టి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ 2023 క్యాలెండర్ (కాలమానిని) ఏరియా జిఎం జి వెంకటేశ్వర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం గిరిజనుల సంక్షేమం కోసం 665 బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేసి చరిత్ర సృష్టించిందని అలాగే ఉద్యోగుల బాగోగులు చూసేందుకు వారి సమస్యలు పరిష్కరించేందుకు ఉద్యోగులకు సింగరేణి యాజమాన్యానికి ఒక వారధిగా ఉండే విధంగా ప్రతి ఏరియాలో లైజన్ ఆఫీసర్లను కూడా నియమించిందని ఆయన గుర్తు చేశారు. అదేవిధంగా ఎస్టి ఎంప్లాయిస్ కూడా సింగరేణి సంస్థ పట్ల అంకితభావంతో పనిచేయాలని కష్టాల్లో ఉన్న తోటి వారిని ఆదుకునేందుకు సామాజిక సేవా కార్యక్రమాలలో కూడా తమ వంతు గుర్తింపు పొందాలని ఆయన కోరారు. సింగరేణి సంస్థ పురోగతితో సంస్థలో పనిచేస్తున్న అన్ని తరగతుల ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు కూడా సంతోషంగా జీవించగలరని ఆయన వెల్లడించారు, ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జి ఎం డి లలిత్ కుమార్, ఏరియా అధికార ప్రతినిధి, ఎస్ రమేష్,ఎస్టి ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఏరియా గౌరవ అధ్యక్షులు ధనసిరి వెంకటేశ్వర్లు (ఏజీఎం సివిల్) అధ్యక్షులు మాలోతు రాముడు (పీకే ఓసి ప్రాజెక్ట్ మేనేజర్) ఏరియా లైజన్ ఆఫీసర్ ఇస్లావత్ సతీష్ కుమార్,ప్రధాన కార్యదర్శి బుద్ధ వెంకటేశ్వర్లు, కార్య నిర్వాహక అధ్యక్షులు బి జగన్ నాయక్, ఉపాధ్యక్షులు తుకారాం, కేంద్ర కమిటీ నాయకులు భూక్య రాందాస్ (సీనియర్ అండర్ మేనేజర్) ఏరియా ప్రధాన కార్యదర్శి డి శంకర్, వి కృష్ణయ్య, సభ్యులు లంబాడి శ్రీహరి నాయక్ ,జి దశరథ్, బి కృష్ణ,డి హరిలాల్, జి సురేష్, నరేష్ ,కుంజ సత్యనారాయణ, తిరుపతి, వీరన్న , కుమారి ,శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

# సీఎం సహాయనిధి పేదలకు వరం

**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ రేగా కాంతారావు.**


**మణుగూరు జనవరి 21 (విజయం న్యూస్)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు రాజుపేట ఏరియాకి చెందిన పి.నరసమ్మ 28000, ఆదర్శ్ నగర్ ఏరియా కు చెందిన బి. శ్రీను బాబు 15000 రూపాయలు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేసిన ... తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ %ం% పినపాక శాసనసభ్యులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బి.ఆర్.ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం సహాయ నిధి కింద అందించే సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఆపద సమయంలో వైద్య ఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి ఆపద్బాంధవుడులా ఆదుకుంటుందని అన్నారు, రాష్ట్ర ప్రభుత్వం బడుగు బలహీన వర్గాల సంక్షేమం విషయంలో పూర్తి భరోసా కల్పిస్తుంది అన్నారు, ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలను కాపాడేదెందుకు రాష్ట్ర ప్రభుత్వం



ముఖ్యమంత్రి సహాయ నిధి కింద చికిత్సకు తగిన సహాయం బాధితులకు అందిస్తుంది అన్నారు, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఎందరో నిరుపేదల ప్రాణాలు నిలబడుతున్నాయని అన్నారు,

## తాతా నిఖిల్ కు నివాళులర్పించిన బిఆర్ఎస్ నాయకులు

**కారేపల్లి జనవరి21 (విజయం న్యూస్):**
ఉమ్మడి ఖమ్మం జిల్లా శాసనమండలి సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తాత మధుసూదన్ అన్న కుమారుడు నిఖిల్ చౌదరి గత రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించగా, శనివారం తిరుమలయపాలెం మండలం పిండిప్రోలు గ్రామంలో వారి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన కారేపల్లి మండల బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దబోయిన ఉమశంకర్, మండల ప్రధాన కార్యదర్శి ఇస్లావత్ బన్సీ లాల్, వైస్ ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, నాయకులు ముత్యాల సత్యనారాయణ, ముత్యాల వెంకటప్పారావు, పొట్ల శ్రీను, దిశ కమిటీ సభ్యులకు సర్పంచ్ బానోత్ కుమార్, సొసైటీ డైరెక్టర్ మర్సకట్ల రోశయ్య తదితరులు.



## జనసేన సమావేశాన్ని విజయవంతం చేయండి

**ధారావత్ కళ్యాణ్ నాయక్ పిలుపు**

**కారేపల్లి జనవరి 21 (విజయం న్యూస్):**
వైరా మండల కేంద్రంలో ఈనెల 23వ తేదీన మిట్టపల్లి గార్డెన్స్ లో జనసేన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు వైరా నియోజకవర్గ జనసేన నాయకుడు డాక్టర్ సంపత్ నాయక్ పిలుపుమేరకు కారేపల్లి మండల జనసేన పార్టీ కార్యకర్తలు పవన్ కళ్యాణ్ అభిమానులు అధిక సంఖ్యలో తరలి రావాలని మండల నాయకుడు ధరావత్ కళ్యాణ్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా కళ్యాణ్ నాయక్ మాట్లాడుతూ.. ఈ ముఖ్య కార్యకర్తల సమావేశానికి జనసేన పార్టీ రాష్ట్ర స్థాయి ముఖ్య నాయకులు పాల్గొంటారన్నారు. కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పవన్ కళ్యాణ్, జనసేన ఆశయాలు, సిద్ధాంతాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు..



## విద్యుత్ కార్యాలయం ఎదుట బిజెపి ధర్నా



**ఏన్కూరు, జనవరి 21 (విజయం న్యూస్)**
ఏ సి డి విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ మండల బిజెపి ఆధ్వర్యంలో శనివారం ఏన్కూర్ లో విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఏ సి డి చార్జీల పేరుతో ప్రజలపై మోయలేని భారం మోపుతున్నారని, దీనిపై ప్రజలు అన్నిచోట్ల అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని, తక్షణమే వీటిని తొలగించాలని, లేని పక్షంలో భవిష్యత్తులో ఆందోళనలు ఉధృతం చేస్తామని ఆ పార్టీ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షుడు నల్లబోతుల రమేష్, రెంటపల్లి నారాయణ, మోర బోయిన కృష్ణ, అప్పారావు, శ్రీను, జాఫర్ మియా, రాంబాబు, వెంకన్న, నాగేశ్వరరావు తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## 100యూనిట్ల విద్యుత్ వాడుకునే ఎస్సీ ఎస్టీ లకు ప్రభుత్వ రాయితీ వర్తింపుచేయాలి

**ఎంపీటీసీ కొండూరి కిరణ్**




**కల్లూరు జనవరి21 (విజయం న్యూస్)**
తెలంగాణరాష్ట్ర విద్యుత్తు నియంత్రన మండ లి ఆధ్వర్యంలో నిర్వహించిన విద్యుత్ విని యోగదారుల అవగాహన కార్యక్రమంలో కల్లూరు ఎంపీటీసీ,రాష్ట్ర టీపిసిసి ఎస్సీ సెల్ డిప్యూటీ కన్వీనర్ కొండూరి కిరణ్ కుమార్ పాల్గొని..!ఉన్నత అధికారుల సమక్షంలోపలు సూచనలు తెలియజేయడం జరిగింది.ఎస్సీ ఎస్టీలకు ప్రతినెల100 యూనిట్ల రాయితీని ప్రకటించిన ప్రభుత్వం,ప్రగటన రూపంలో కాకుండా,పక్కాగా అమలు చేసి చూపించాల ని,పేద ప్రజలపై భారం మోపుతున్న ఎసిడి డిపాజిట్ బిల్లులను రద్దు చేయాలని,విద్యుత్ మండలి చైర్మెన్ ను కోరారు.ఈకార్యక్రమంలో జిల్లాస్థాయి,మండల స్థాయి అధికారులు ప్రజాప్రతినిధులు,వినియోగదారులు పాల్గొన్నారు.

## చిన్నారిని ఆశీర్వదించిన ఎమ్మెల్యే సండ్ర.

**దివ్యాంగుడికి ఆర్థిక సహాయం**

**తల్లాడ జనవరి 22 విజయం న్యూస్:**
తల్లాడ మండలం మల్లవరం గ్రామంలో ఇటీవల అన్నప్రాసన జరిగిన చిన్నారి మేడి కేతన్ సిద్ధార్థ మౌర్య(రావణ్)ను శనివారం సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆశీర్వదించారు. ఈ సందర్భంగా చిన్నారి తల్లిదండ్రులు నీటి పారుదల శాఖ ఎఇ మేడి అప్పారావు పంచాయతీ కార్యదర్శి సావిత్రి దంపతులు ఎమ్మెల్యేను శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం దివ్యాంగుడైన అద్దంకి నరసింహారావుకు ఎమ్మెల్యేతో పాటు అప్పారావు సావిత్రి దంపతులు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో రైతు బంధు మండల అధ్యక్షుడు దుగ్గిదేవర వెంకటలాల్, మాజీ సర్పంచ్ మేడి సీతారాములు,వార్డు సభ్యుడు అద్దంకి వెంకటేశ్వర్లు, బిఆర్ఎస్ నాయకుడు మేడి కృష్ణ(పెద్దబ్బాయి) తదితరులు పాల్గొన్నారు.



# అర్హులైన నిరుపేదలకు ఇండ్లకై పోరాటం చేస్తాము

**అక్రమ రెస్టులకు భయపడేది లేదు...**

**సంక్షేమ కార్యక్రమాలలో అవతవకలపై విచారణ. జరపాలి**

**బిఎస్ఎస్ఎమ్ ఛైర్మన్ మద్దిశెట్టి సామెలు డిమాండ్**






**చంద్రుగొండ విజయం న్యూస్ ( జనవరి 21)**

పిబ్రవరి 5 తారీఖు నుండి తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లు లేని నిరుపేదలకు పక్కా ఇళ్లు నిర్మించెంత వరకు ప్రభుత్వంపై పేదల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు,భారతీయ సర్వ సమాజ మహ సంఘం రాష్ట్ర ఛైర్మన్ మద్దిశెట్టి శ్యామ్యూల్ డిమాండ్ చేసారు.భద్రాది కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలంలోని ముఖ్య కార్యకర్తల సమావేశంలో ముఖ్యాతిధిగా పాల్గొని ప్రస్తుత ప్రభుత్వం పై పలు విమర్శలు చేసారు.సొంత ఇంటి స్థలం కలిగియున్న ప్రతి ఒక్కరికి పక్కా ఇళ్లు కట్టుకొనుటకు ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేసారు.డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పథకం లొ ఘోరంగా విఫలమైన ప్రభుత్వం, కనీసం పేదవాడి స్వంత ఇంటి సాకారానికై చిత్త శుద్ధి వహించాలని కోరారు.ప్రభుత్వం ఇప్పటి వరకు డబల్ బెడ్ రూం విషయంలో ఇదిగో ఇస్తాం అదిగో ఇస్తాం అంటూ ఆశ చూపుతూ . నిజమైన పేదరికులకు అన్యాయం చేస్తున్నారని ఘాటు విమర్శ చేసారు.ఇప్పటి వరకు కట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లపై లెక్కలు చెప్పాలని డిమాండ్ చేసారు.ఇచ్చిన ఈ ఇండ్ల కోలనీలలొ కనీస మౌళిక సదుపాయాలు కల్పించ లేకపోయిందని విమర్శించారు.తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తు,గిరిజన గ్రామాలలొ మౌళిక వసతుల పట్ల శ్రద్ద వహించాలని కోరారు.మొదటి నుంచి ఎవరైతే పోడు భూమి సాగులో ఉన్నారో వారికి అటవీ హక్కుల చట్ట ప్రకారం పట్టా హక్కులు కల్పించాలని కోరారు.ఈ విషయం లొ మహిళల పట్ల జరుగుతున్న దాడులను,కేసులను అరికట్టాలని,ఫారెస్ట్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. రైతు భందు 5 ఎకరాల లోపు సన్న చిన్నకారు రైతులకి మాత్రమే ఇవ్వాలని. వందలాది ఎకరాలు భూమి వున్న వారికి రైతు భందు అవసరం లేదని,ప్రభుత్వం మెహర్బానికి పోయి రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని ఘాటు విమర్శ చేసారు.సంక్షేమ బాలిక బాలుర హస్టల్ల పై ప్రభుత్వం ప్రత్యేకంగా ఒక బృందాన్ని ఏర్పాటు చేసి ఆహారం మరియు హస్టల్ల మౌళిక వసతుల విషయంలో విద్యార్ధులకు కలుగుతున్న ఇబ్బందులకు ఇబ్బందులకు గురి చేసే వారిపైన ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.గిరిజన హిందూ పూజారులను పభుత్వం గుర్తించి నెలసరి జీతాలు గుడి నిర్మాణానికి నిధులు మరియు మౌళిక వసతులు కల్పించటానికి నిధులు ఇవ్వాలని కోరారు. దళితుల ఇనామ్ భూములు మంగలి, చాకలి, ఇనామ్ భూములకు ఆక్రయించుకున్న వారిపై రెవెన్యూ అధికారులు విచారణ జరిపి ఇనామ్ దారులకు వారి భూములను వారికి అప్పజెప్పాలని డిమాండ్ చేసారు.మీడియా మిత్రులపై జరుగుతున్న దాడులను అయన ఖండించారు, అక్రమ కేసులు ఆపాలన్నారు.. పక్కా ఇళ్లు లేని మీడియా మిత్రులను గుర్తించి పక్కా ఇళ్లు, ఇంటి స్థలం కేటాయించాలని అయన డిమాండ్ చేసారు.

2019 నుంచి 2023 వరకు ప్రభుత్వ అధికారులకు ప్రజల పక్షానా సమస్యలపై ధరఖాస్తులు ఇస్తున్నా న్యూడిల్లీ, హైదరాబాద్, ప్రభుత్వ అధికారులు నుండి కింది స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్నా క్రింది సాయి రెవిన్యూ మరియు ఫారెస్ట్ మిగతా యంత్రాంగం స్పందించిన దాఖాలాలు లేవని, దళిత బందు పంపకాలలో అవకతవకలు జరిగాయని, పోడు భూముల సర్వే విషయంలో అవకతవకలు జరిగాయని. రైతు పాసు పుస్తకాలు జారీ చేసే విషయంలో అవకతవకలు జరిగాయని వీటన్నిటిపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరపకుంటే పోరాటాన్ని విజృంభిస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో బి.ఎస్.ఎస్ ఎమ్. చంద్రుగొండ మండల అధ్యక్షులు శేషు,జూలూర్ పాడు అధ్యక్షలు భూక్యా రమేష్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఫోటోగ్రఫిలో గిరిజన బిడ్డకు జాతీయస్థాయి గుర్తింపు

## ఫస్ట్ నేషనల్ వర్క్ షాప్ విజేతగా లక్ష్మణ్

కారేపల్లి జనవరి21 (విజయం న్యూస్):

శోభ ఫోటోగ్రఫీ అకాడమీ ఆధ్వర్యంలో ఐటీడీఏ ఆంధ్ర ప్రదేశ్ గవర్నమెంట్ నిర్వహించిన గిరిజన సాంప్రదాయ జీవన విధానం వాళ్ల స్థితిగతులపై మూడు రోజుల పాటు జరిగిన ఫస్ట్ నేషనల్ వర్క్ షాప్ లో కారేపల్లి మండలం మాణిక్యం గుడితండా గ్రామానికి చెందిన లావుడియా లక్ష్మణ్ జాతీయ అవార్డు దక్కించుకున్నారు. ఈ అవార్డును చెట్టు మోహన్, గణపతి, మేకల శ్రీనివాస్, కుమారస్వామి, మారుతి లు లక్ష్మణ్ ను శుక్రవారం అందజేశారు. గిరిజన బిడ్డకు జాతీయ స్థాయిలో గుర్తింపు రావడం పట్ల, ఫోటోగ్రాఫర్లు లక్ష్మణ్ నీ అభినందించారు.






## నేడు విద్యుత్ కి అంతరాయం.

**తల్లాడ జనవరి 22 విజయం న్యూస్:**

తల్లాడ టౌన్ ఫీడర్ లో మరమ్మతుల దృష్ట్యా ఉదయం సమయం 09:00 గంటల నుండి మధ్యాహ్నం 03:00 గంటలవరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడును . తల్లాడ, నారాయణపురం,మల్లారం గ్రామాలకు విద్యుత్ సరఫరా లొ అంతరాయం కలుగుతుందని పరిశ్రమల యజమానులు వినియోగదారులు సహకరించాలని అసిస్టెంట్ ఇంజనీర్ విద్యుత్ శాఖా రాజేష్ తెలిపారు

## టి.ఎల్ పేట దేవాలయంలో కుంకుమ పూజ




**ఏన్కూరు, జనవరి 21 (విజయం న్యూస్)**

మండల పరిధిలోని టిఎల్ పేట శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో శుక్రవారం రాత్రి కుంకుమ పూజ ఘనంగా జరిగింది. తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగిన పూజా కార్యక్రమాల్లో భాగంగా ఈ కుంకుమ పూజ జరిగింది. ఏన్కూరు, టి ఎల్ పేట గ్రామాల నుంచి మహిళలు ఈ కుంకుమ పూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ ఛైర్మన్ ఇల్లూరి ఆదినారాయణ, పోకల గూడెం వెంకటేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## శ్రీనివాసరావు కుటుంబాన్ని అండగా నిలిచిన ఎమ్మెల్యే రాములు నాయక్



**కారేపల్లి జనవరి21 (విజయం న్యూస్):**

కారేపల్లి మండలం పాత కమలాపురం బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు వడ్డే శ్రీనివాసరావు దశదిన కర్మకు, శనివారం వైరా శాసనసభ్యులు లావుడియా రాములు నాయక్ క్వింటా బియ్యంను, మండల అధ్యక్షుడు పెద్దబోయిన ఉమశంకర్, మండల రైతుబందు కన్వీనర్ గుగులోత్ శ్రీను, ఎంపీటీసీ దారావత్ పాండ్య నాయక్, సర్పంచ్ గుగులోత్ పద్మ మంగ్య, స్థానిక నాయకులు చేతుల మీదుగా అందించి వారి కుటుంబాన్ని భరోసా కల్పించి అండగా నిలిచారు.

## తిరుమలాయపాలెం పెట్రోల్ బంకు సమీపంలో రోడ్డు ప్రమాదం

**తిరుమలాయపాలెం, జనవరి 21 (విజయం న్యూస్)**

తిరుమలాయపాలెం మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ సమీపంలో ఖమ్మం వరంగల్ ప్రధాన రహదారిపై వరంగల్ వైపు వెళ్తున్న కారును వెనుక నుండి లారీ ఢీ కొట్టింది ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదని సమీపంలోని పండ్ల వ్యాపారం చేసుకుంటున్న వారు తెలిపారు ఈ ప్రమాదంలో కారు వెనుక భాగం పూర్తిగా ధ్వంసం అయిందని ఎవరికి ఎటువంటి గాయాలు కాలేదని లారీ కారును ఢీకొట్టడంతో భారీ శబ్దం వచ్చిందని శబ్దం విని ఆ ప్రాంత ప్రజలు భయాందోళనకు గురయ్యారు ఎటువంటి హాని ప్రాణ నష్టం జరగకపోవడంతో స్థానికులు బాటసారులు అంతా ఊపిరి పీల్చుకున్నారు

